సాక్షి
విశాఖపట్నం

శనివారం : 30 : మార్చి : 2024



ఆధ్యాత్మికతకు నెలవు

రుషికొండలోని శ్రీవారి ఆలయం ద్వితీయ వార్షికోత్సవం నేడు జరుపుకోనుంది.

IIలో



గెలుపెవరిది?

IIలో

కూటమి బూటకం

- ఎక్కడికక్కడే ఒంటరి పోరాటం
- నియోజకవర్గాల్లో పొసగని పొత్తు
- తలోదారిలో టీడీపీ, జనసేన, బీజేపీ క్యాడర్
- అభ్యర్థుల ప్రచారానికి ఆమడ దూరం
- బరిలో నిలిచిన కూటమి అభ్యర్థుల్లో ఓటమి భయం




సాక్షి, విశాఖపట్నం : తెలుగుదేశం, జనసేన, బీజేపీల కూటమిలో పొత్తులు పొసగడం లేదు. ఉమ్మడి విశాఖ జిల్లాలో పలు నియోజకవర్గాల్లో ఒకరికొకరు సహకరించుకోవడం లేదు. ఆ పార్టీల ముఖ్య నేతలు, శ్రేణులు ఈ ఎన్నికల్లో తామంతా కలిసి ముందుకు వెళ్తున్నామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే పలుచోట్ల కూటమి అభ్యర్థులు ప్రచారాన్ని ప్రారంభించినా వారి తరఫున ప్రచారానికి కార్యకర్తలు దూరంగా ఉంటున్నారు. అక్కడక్కడ మొక్కుబడిగా కనిపిస్తున్నారు. దీంతో అభ్యర్థులు ఒంటరి పోరాటం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో పేరుకే పొత్తులు తప్ప లోలోపల 'మిత్రులకు' సహాయ నిరాకరణను కొనసాగిస్తున్నారు. దీంతో ఇప్పట్నుంచే కూటమి అభ్యర్థులకు ఓటమి భయం వెంటాడుతోంది.

- విశాఖ ఉత్తర నియోజకవర్గం పొత్తులో బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజుకు దక్కింది. ఆ నియోజకవర్గంలో టీడీపీ, జనసేన క్యాడర్ ఆయన వెంట ప్రచారానికి సుముఖత చూపడం లేదు. ఈ సీటు ఆశించిన పసుపులేటి ఉషాకిరణ్, బొడ్డేటి రఘులను ఇప్పుడు ప్రసన్నం చేసుకునే పనిలో విష్ణుకుమార్‌రాజు ఉన్నారు. అక్కడ అంతంతమాత్రంగా ఉన్న టీడీపీలో సరైన నాయకుడే లేదు. ఉన్న అరకొర నాయకులూ బీజేపీ అభ్యర్థి వెంట నడవడం లేదు.
- విశాఖ తూర్పు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి వెలగపూడికి బీజేపీ, జనసేన శ్రేణులు దూరంగా ఉంటున్నారు. దీంతో తన అనుచరులతోనే వెలగపూడి ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.
- విశాఖ 'పశ్చిమ'లో టీడీపీ అభ్యర్థి గణబాబుకు మద్దతుగా బీజేపీ, జనసేన సీనియర్లు ప్రచారంలో పాల్గొనడం లేదు. తమకు సహకరించాలని గణబాబు తన వర్గీయులను పంపుతున్నా అటు నుంచి ఆశించిన స్పందన కనిపించడం లేదు.

- పొత్తులో విశాఖ దక్షిణ నియోజకవర్గం జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌కు కేటాయించారు. ఈయన అభ్యర్థిత్వాన్ని ఆ పార్టీలో సీటును ఆశించిన ముగ్గురు ముఖ్య నేతలు షాదిక్, కందుల నాగరాజు, మూగి శ్రీనివాసరావులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వీరు వంశీకి సహకరించే ప్రసక్తే లేదని తెగేసి చెబుతున్నారు. ఈ సీటుపై టీడీపీ నుంచి అక్కడ ఇన్‌చార్జి గండి బాబ్జీ గంపెడాశలు పెట్టుకున్నారు. కానీ జనసేనకు ఖరారు చేయడంతో రాజీనామా చేస్తానని బెదిరించారు. ఆ తర్వాత చంద్రబాబు బుజ్జగించడంతో మెత్తబడినా పూర్తి స్థాయిలో వంశీ కోసం పనిచేస్తారన్న నమ్మకం లేదు. ప్రస్తుతం వంశీకృష్ణ తన అనుచరులతోనే దక్షిణలో ప్రచారం చేసుకుంటున్నారు.

- పెందుర్తి సీటును జనసేనకు కేటాయించడంతో ఆ సీటు తనకే ఖాయమనుకున్న టీడీపీకి చెందిన మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి అగ్గి మీద గుగ్గిలం అవుతున్నారు. తన అనుచరులను రోజూ రోడ్డెక్కించి ఆందోళనలు చేయిస్తున్నారు. దీంతో అక్కడ జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబుకు టీడీపీ నుంచి సహకారం కనుచూపు మేరలో కనిపించడం లేదు. దీంతో జనసేన క్యాడరుతోనే ఒంటరిగా ప్రచారం చేసుకుంటున్నారు.
- యలమంచిలి సీటును జనసేన అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్‌కు కేటాయించారు. ఈయన అభ్యర్థిత్వాన్ని అక్కడ సీటును ఆశించిన టీడీపీ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు అంగీకరించడం లేదు. ప్రగడ అనుచరులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేసి పార్టీ కార్యాలయంలో ఫర్నిచరును కూడా ధ్వంసం చేశారు. జనసేన అభ్యర్థికి మద్దతుగా ప్రచారానికి ముందుకు రావడం లేదు.
- ఇక చోడవరంలోనూ అదే పరిస్థితి. టీడీపీ అభ్యర్థి కేఎస్‌ఎన్ రాజుకు టికెట్టు ఇవ్వడాన్ని అక్కడ జనసేన, బీజేపీ నాయకులకు ఇష్టం లేదు. అందువల్ల రాజు ఎన్నికల ప్రచారానికి వెళ్లడానికి వీరు సుముఖత చూపడం లేదు.
- మాడుగులలో విచిత్రమైన పరిస్థితి ఉంది. అక్కడ పైలా ప్రసాద్‌కు టీడీపీ సీటు ఇవ్వడాన్ని ఆ పార్టీకే చెందిన మాజీ ఎమ్మెల్యే రామానాయుడు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆయన వర్గీయులెవరూ ప్రసాద్ ప్రచారంలో పాల్గొనడం లేదు. ఇక జనసేన, బీజేపీ నాయకులూ ప్రచారానికి వెళ్లడం లేదు.
- పాయకరావుపేట టీడీపీ టికెట్టు అనితకిచ్చారు. ఆమె అభ్యర్థిత్వాన్ని అక్కడ జనసేన నాయకుడు గెడ్డం బుజ్జి వర్గీయులతో పాటు టీడీపీలోని ఒక వర్గం ఎప్పట్నుంచో ససేమిరా అంటోంది. ఇటీవలే బుజ్జి వర్గాన్ని బుజ్జగించినా ప్రచారంలో పాల్గొనడంపై ఇంకా మీనమేషాలు లెక్కిస్తున్నారు. బీజేపీ ముఖ్య నాయకులు కూడా ఆమె వెంట కనిపించడం లేదు.
- ఇక రంపచోడవరం సీటు టీడీపీ అభ్యర్థి శిరీషకు దక్కింది. ఆమెకు టికెట్టు ఇవ్వడంపై అక్కడ మాజీ ఎమ్మెల్యేలు వంతల రాజేశ్వరి, వెంకటేశ్వరరావులు గుర్రుగా ఉన్నారు. దీంతో శిరీషకు సొంత పార్టీ వారి మద్దతు ప్రశ్నార్థకంగా మారింది.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే





గుడ్‌ఫ్రై డే పర్వదినాన్ని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఏసుక్రీస్తు మరణానికి సంబంధించిన ఘట్టాలను ప్రదర్శిస్తూ భారీ ర్యాలీ చేశారు. జ్ఞానాపురం పునీతపేతురు ప్రధాన దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భీమిలిలో ఏసుక్రీస్తు వేషధారి శిలువను మోయడం, ఆయనను రాజభటులు కొడుతూ చిత్రహింసలకు గురిచేయడం భక్తులను కదిలించింది. ఈ ప్రదర్శనలో మహిళలు, పిల్లలు, చర్చి ఫాదర్లు పాల్గొన్నారు.

కోడ్‌లోనూ ఉల్లం'ఘనుడే'..

- అనకాపల్లి పార్లమెంటు కూటమి అభ్యర్థి రమేష్ అత్యుత్సాహం
- స్వాగత ర్యాలీలో 4 గంటల పాటు ప్రజలకు చుక్కలు
- అనుమతికి మించి 2 వేల మంది జనం, 300 కార్లతో ర్యాలీ
- లంకెలపాలెం-అనకాపల్లి హైవేపై స్తంభించిన ట్రాఫిక్
- బండారుతోపాటు పరవాడ మండలం టీడీపీ కార్యకర్తల డుమ్మా

సాక్షి, అనకాపల్లి: వివాదాస్పద నాయకుడు, కూటమి తరఫున అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయనున్న సి.ఎం.రమేష్ ఆదిలోనే నియోజకవర్గ ప్రజలకు చుక్కలు చూపించారు. ఇంకా నామినేషన్ వేయక ముందే తన ధన బలం ఈ ప్రాంత వాసులకు చూపించాలని అత్యుత్సాహం ప్రదర్శించారు. భారీ ఎత్తున స్వాగత ర్యాలీ నిర్వహించి అడుగడుగునా కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను ఉల్లంఘించారు. దాంతో లంకెల పాలెం నుంచి అనకాపల్లి వరకూ 11 కిలోమీటర్ల మేర హైవేపై ట్రాఫిక్ స్తంభించింది. శుక్రవారం ఉదయం 11.55 గంటలకు లంకెలపాలెం వచ్చిన రమేష్‌కు స్వాగతం పలకడం కోసం.. 9.30 గంటల నుంచే ట్రాఫిక్ అంతరాయం కలిగింది. దాదాపు నాలుగు గంటల పాటు వాహనచోదకులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జిల్లా ఎన్నికల అధికారి నుంచి 100 మందికి, 5 కార్లకు మాత్రమే అనుమతి కోరిన వారు.. 300కు పైగా కార్లు, 2 వేల మందికిపైగా జనంతో ర్యాలీగా వెళ్లారు. అనకాపల్లిలో ముఖ్య నాయకుల మీటింగ్‌కు మాత్రమే అనుమతి కోరిన బీజేపీ ఎంపీ అభ్యర్థి జాతీయ రహదారిపై ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తూ.. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ ర్యాలీ చేశారు. దీంతో ట్రాఫిక్ క్లియర్ చేయడానికి పోలీసులకు అదనంగా రెండు గంటల సమయం పట్టింది. మధ్యాహ్న సమయంలో మండుటెండలో ప్రజలు చాలా ఇబ్బంది పడ్డారు.



లంకెలపాలెం నుంచి అనకాపల్లి జలగాం మదుం జంక్షన్ వరకూ బీజేపీ ఎంపీ అభ్యర్థి రమేష్ స్వాగత ర్యాలీలో స్తంభించిన ట్రాఫిక్

ప్రారంభంలోనే ర్యాలీకి 'బండారు'దెబ్బ : పరవాడ మండలం లంకెలపాలెం నుంచి స్వాగత ర్యాలీ ప్రారంభించారు. ప్రారంభంలోనే సీఎం రమేష్‌కు చుక్కెదురైంది. పెందుర్తి నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకులు గానీ, కార్యకర్తలు గానీ ఎవరూ హాజరు కాలేదు. బీజేపీ, జనసేన పార్టీల నుంచి మాత్రమే స్వాగతం పలికారు. టీడీపీ నుంచి ఒక్క కార్యకర్త రాలేదు. బండారు సత్యనారాయణమూర్తికి పెందుర్తి టికెట్ ఖరారు చేయలేదనే ఆగ్రహంతో ఉన్న పెందుర్తి నియోజకవర్గం టీడీపీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు ఎవరూ రాలేదు. మాజీ మంత్రి బండారు ఆరోగ్యం బాలేకపోయినా.. ఆయన అనుచరులెవరూ రాలేదు. పెందుర్తి కూటమి అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు లంకెలపాలెం జంక్షన్‌కు రాలేదు. అనకాపల్లిలో ముఖ్య నేతల సమావేశానికి చివరిలో మొక్కుబడిగా వచ్చి వెళ్లిపోయారు. స్వాగత ర్యాలీకి, ఆత్మీయ సమావేశానికి మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, ఆయన కుమారుడు దాడి రత్నాకర్, వారి అనుచరులు డుమ్మా కొట్టారు. టీడీపీ, బీజేపీ, జనసేన పెందుర్తి అసెంబ్లీ అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు స్వాగత కార్యక్రమానికి డుమ్మా కొట్టారు. టీడీపీ మాజీ మంత్రి బండారు పార్టీపై ఆగ్రహంతో ఉండడంతో ఆయన వర్గానికి చెందిన వారెవ్వరూ పరిసర ప్రాంతంలో కనపించలేదు.

పదో తరగతి మూల్యాంకనంపై ప్రత్యేక దృష్టి



కేంద్రంలోని గదులను పరిశీలిస్తున్న దేవానంద్‌రెడ్డి, చంద్రకళ

విశాఖ విద్య: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనంపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వ పరీక్షల విభాగం రాష్ట్ర డైరెక్టర్ డి.దేవానంద్‌రెడ్డి సూచించారు. జ్ఞానాపురం జూబ్లీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన మూల్యాంకనం కేంద్రాన్ని శుక్రవారం ఆయన డీఈవో ఎల్.చంద్రకళతో కలిసి పరిశీలించారు. కేంద్రంలోని అన్ని గదులను తనిఖీ చేశారు. విధులకు హాజరయ్యే ఉపాధ్యాయులకు కల్పించిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. మహిళా ఉపాధ్యాయులకు ప్రత్యేక వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. గతంలో పాత పోస్టాఫీసు సెంటర్‌లో ఉన్న క్వీన్‌మేరీ ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో మూల్యాంకనం కేంద్రం ఉండేదని, మెరుగైన సౌకర్యాల కల్పనలో భాగంగా ఈ ఏడాది జ్ఞానాపురం జూబ్లీ హైస్కూల్‌కు మార్పు చేసినట్లు డీఈవో తెలిపారు. ప్రభుత్వ పరీక్షల జిల్లా కమిషనర్ మురళీమోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి

- వైఎస్సార్ సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి
- ఐదేళ్లకోసారి వచ్చే పగటి వేషగాళ్లను నమ్మకండి : మంత్రి బొత్స

ఆనందపురం : గత పాలకుల నిర్లక్ష్యంతో వెనకబాటుకు గురైన ఉత్తరాంధ్ర ప్రాంతం సర్వతోముఖాభివృద్ధి సాధించాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవలసిన బాధ్యత ప్రజలపై ఉందని వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర కో-ఆర్డినేటర్, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. ఆనందపురంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో శుక్రవారం భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్ మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే విశాఖ పరిపాలన రాజధాని అవుతుందని చెప్పారు. ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి ఇప్పటికే భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణంతో పాటు మూడు మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేశామన్నారు. పేదలకు అందని ద్రాక్షగా మారిన కార్పొరేట్ వైద్య సేవలను జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా ఇంటి ముంగిటకే అందించి, ఎంతో మందికి మేలు చేశామన్నారు. విద్య, వైద్య సేవలు సక్రమంగా అందాలన్న ఉద్దేశంతో ఆ రంగాలకు రెండు రెట్ల నిధులను కేటాయించామన్నారు. ముఖ్యంగా ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25 లక్షల వరకూ పెంచామని వివరించారు. గతంలో కూడా మూడు పార్టీలూ కూటమి పేరుతో కలిసి వచ్చి ఎన్నో హామీలు ఇచ్చి ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ వివరించి వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల విజయానికి ప్రజా మద్దతును కూడగట్టాలని పిలుపునిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో మంత్రి బొత్స సత్యనారాయణ, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కూటమి మాటలు నమ్మొద్దు

మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ అనైతికంగా కూటమి పేరుతో కలిసి వస్తున్న మూడు పార్టీల నాయకులు పగటి వేషాలు వేసి మభ్య పెడతారని చెప్పారు. స్వప్రయోజనాలు తప్ప ఆ మూడు పార్టీల నాయకులకు రాష్ట్ర ప్రయోజనాలు అక్కర లేదని ప్రజలు గమనించాలన్నారు. రాష్ట్రాన్ని 14 ఏళ్లు పాలించి ప్రజలకు ఏమీ చేయలేని చంద్రబాబు.. అధికారం కోసం సున్నితమైన విషయాలను కూడా వివాదాస్పదం చేస్తూ లబ్ధి పొందాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. సీఎం వైఎస్ జగన్ చెప్పిందే చేస్తారని, చేసిందే చెబుతారని, అందుకే ప్రజల్లో ఆయనకు ఎంతో ఆదరణ లభిస్తోందన్నారు. గతంలో గ్రామాల్లోకి ప్రచారానికి వెళ్లడానికే ఇబ్బంది పడేవారమని.. నేడు ప్రభుత్వం కూడా అందరికీ మేలు చేయడంతో ఓట్లు అడగడానికి ధైర్యంగా వెళ్లగలుగుతున్నామని చెప్పారు. వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావులను గెలిపించితే ఐదేళ్ల పాటు ప్రజలు సమాజంలో తలెత్తుకునేలా చేస్తామన్నారు. అన్ని వేళలా అందరికీ అందుబాటులో ఉంటామని తెలిపారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ సహకారంతో భీమిలి నియోజకవర్గంలో రూ.400 కోట్లతో సంక్షేమ అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ పరిశీలకుడు పసుపులేటి బాలరాజు, రీజనల్ యూత్ కో-ఆర్డినేటర్ ముత్తంశెట్టి శివ నందీస్, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, భీమిలి మార్కెట్ కమిటీ చైర్మన్ ఎలమంచిలి సూర్యానారాయణ, వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు బంక సత్యం, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, వైస్ ఎంపీపీ పాండ్రింకి శ్రీను, సహకార సంఘం అధ్యక్షుడు పాండ్రింకి అప్పారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బంటుబిల్లి మణిశంకర నాయుడు, నాయకులు బొట్టా రామకృష్ణ, బీఆర్‌బీ నాయుడు, కోరాడ అప్పలస్వామి నాయుడు, కోన శ్రీను, పిన్నింటి వెంకట రమణ, కె.చంద్రమౌళి, చెన్నా సత్యం, గంర్రెడ్డి శ్రీనివాస్, చందక లక్ష్మి, లెంక రాంబాబు, కోరాడ ముసిలి నాయుడు, చందక అప్పలస్వామి, షిణగం చిన్న రామారావు, డోల ఆనంద్, చందక సూరిబాబు పాల్గొన్నారు.


పురందేశ్వరి వల్లే పార్టీ భ్రష్టుపట్టింది

బీజేపీ జిల్లా పదాధికారుల సమావేశంలో నేతల ఫైర్

సాక్షి, విశాఖపట్నం: 'భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి వల్లే రాష్ట్రంలో పార్టీ భ్రష్టుపట్టిపోయింది. ఆమె ఏకపక్ష నిర్ణయాలతో పార్టీ నాశనమవుతోంది. రాష్ట్రంలో ఎంపీ, ఎమ్మెల్యే సీట్లలో నాలుగో వంతు కమ్మ సామాజికవర్గానికే కేటాయిస్తారా? ఆ కులస్తులు ఎంతమంది ఉన్నారు? అధిక సంఖ్యలో ఉన్న కాపులకు ఒక్క సీటూ ఇవ్వరా? ఆ సామాజిక వర్గాన్ని పట్టించుకోరా?' అంటూ బీజేపీ విశాఖ జిల్లా పదాధికారుల సమావేశంలో ఆ పార్టీ నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. ఈ సమావేశం గురువారం నాలుగు గోడల మధ్య జరగడంతో బయటకు పొక్కలేదు. శుక్రవారం ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వెలమ, కమ్మ సామాజిక వర్గానికి ఉత్తరాంధ్రలో సీట్లు ఎలా కేటాయిస్తారని ప్రశ్నల వర్షం కురిపించారు. బీజేపీ అగ్రనేతలు అరుణ్‌సింగ్, మధుకర్‌ల సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో జీవీఎల్, సోము వీర్రాజు, మాధవ్‌లకు సీట్లు ఎందుకివ్వలేదో చెప్పాలని డిమాండ్ చేయడంతో అగ్రనేతలు సహా, ఇతర నాయకులు ఖిన్నులయ్యారు. ఉత్తరాంధ్రలో సీఎం రమేష్, ఈశ్వరరావులకు సీట్లు ఎలా ఇస్తారని నిలదీశారు. వీరికి ఏం సమాధానం చెప్పాలో తెలియక అగ్రనేతలు వీరిని ఏదోలా సముదాయించే ప్రయత్నం చేసినప్పటికీ ఈ నాయకులు వెనక్కి తగ్గలేదని తెలిసింది. రాష్ట్రంలో మరెక్కడా ఎదురు తిరగని విధంగా విశాఖలో పదాధికారుల సమావేశంలో అగ్రనేతల ఎదుటే పురందేశ్వరి సహా ఇతర నాయకులపై ఘాటుగా విమర్శలు చేయడం, అంశాల వారీగా నిలదీయడం ఇప్పుడు బీజేపీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

'ఉత్తర' కుమారుడు.. మళ్లీ భీమిలికి..

- ఎన్నికకో నియోజకవర్గం మారుతున్న గంటా
- సంచార రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా పేరు
- చివరి నిమిషంలో భీమిలి టికెట్ కేటాయించిన చంద్రబాబు
- ఉత్తరంలో గెలిచిన ఐదేళ్లలో జనానికి ముఖం చాటేసిన వైనం
- భీమిలి ప్రజల్ని మరోసారి మోసం చేసేందుకు పయనం



సాక్షి, విశాఖపట్నం : ఆయనో రాజకీయ సంచారజీవి.. పిల్లిపిల్లలను మార్చిన చందంగా ఎన్నికలకో నియోజకవర్గం మారుస్తూ.. పోటీ చేసిన ప్రతి నియోజకవర్గంలో ప్రజల్ని ఏమారుస్తూ.. గెలిచిన తర్వాత.. ఓటర్లను మోసం చేస్తూ.. చివరి నిమిషంలో అక్కడి నుంచి జంప్ అయిపోతారు. ఎన్నికలకో సెగ్మెంట్ మారుస్తున్న గంటా శ్రీనివాసరావు అడ్డగోలు సంపాదన, స్థిర, చరాస్తులను కూడబెట్టడంలో మాత్రం ఏకరీతినే దూసుకుపోయారు. నిన్న మొన్నటి వరకూ టికెట్ కోసం అధిష్టానం చుట్టూ కాళ్లరిగేలా తిరిగే స్థితికి చేరుకున్న గంటాకు.. చీపురుపల్లిలో పోటీ చేయాల్సిందేనని చంద్రబాబు తేల్చి చెప్పగా.. చివరికి బతిమాలుకొని భీమిలి టికెట్ సంపాదించుకున్నారు. ఈ ఎన్నికల్లో తన వలస రాజకీయంతో మరోసారి భీమిలి ప్రజలను మోసం చేసేందుకు అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నారు. ప్రకాశం జిల్లా నుంచి బతుకుదెరువు కోసం విశాఖకు వలస వచ్చి ఓ దినపత్రికలో యాడ్ ఎగ్జిక్యూటివ్‌గా జీవితాన్ని ప్రారంభించాడు. చిరుద్యోగిగా ఆదాయ ప్రస్థానం మొదలుపెట్టిన గంటా.. ఆ తర్వాత షిప్పింగ్ రంగంలో వ్యాపారవేత్తగా ఎదిగారు. 1999లో అనూహ్య రీతిలో టీడీపీ తరఫున అనకాపల్లి ఎంపీగా, ఆ తర్వాత 2004లో చోడవరం నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా, 2009లో ప్రజారాజ్యం తరఫున అనకాపల్లి ఎమ్మెల్యేగా, 2014లో భీమిలి నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా, 2019లో విశాఖ ఉత్తర ఎమ్మెల్యేగా గెలుపొందారు. నిజానికి 1999లో ప్రజాప్రతినిధిగా రాజకీయ జీవితం మొదలుపెట్టినా.. కాంగ్రెస్‌లో ప్రజారాజ్యం విలీనమైన పరిణామాల నేపథ్యంలో 2011లో తొలిసారి మంత్రి బాధ్యతలు స్వీకరించారు. అప్పటినుంచి క్రమక్రమంగా ఆరోపణలు వెల్లువెత్తుతూ వచ్చాయి. ఇక 2014లో టీడీపీ ప్రభుత్వం కొలువుదీరడంతో గంటాకు మళ్లీ మంత్రి పదవి రావడం దరిమిలా మొదలైన అవినీతి, అక్రమార్జన పర్వం, దోపిడీ పరాకాష్టకు చేరుకుంది.

అంతులేని గంటా గ్యాంగ్ దందాలు

ఎన్ని అవినీతి ఆరోపణలు వచ్చినా లెక్క చెయ్యకుండా.. అవినీతిని కొనసాగించడమే గంటా స్టైల్. గంటా విశాఖ నగరంలోని ఎంవీపీ కాలనీలో ఉంటున్న బహుళ అంతస్తుల భవంతితో పాటు.. ప్రత్యూష పేరుతో కంపెనీ స్థాపించి.. రూ.200 కోట్లకు పైగా రుణాలు తీసుకొని ఎగ్గొట్టేశారు. దీంతో సదరు ఇండియన్ బ్యాంకు గంటా అండ్ కో అడ్డగోలుగా సంపాదించిన పలు స్థలాల్ని వేలం వేస్తుండగా.. మరికొన్ని స్థలాల్ని స్వాధీనం చేసుకుంది. గంటా దోపిడీ పర్వాన్ని మొత్తం లెక్క కడితే రూ.వందల కోట్లపైనే ఉంటుందని టీడీపీ నేతలే అంచనా వేస్తున్నారు. 2014 నుంచి 2019 వరకూ గంటా గ్యాంగ్ భీమిలిలో సాగించిన భూదందాలతో మళ్లీ అక్కడ మొఖం చూపించలేని పరిస్థితిని తెచ్చుకున్నారు. నమ్ముకొని ఓటేసిన భీమిలి ప్రజలకు ఏమాత్రం మంచి చెయ్యకుండా కనిపిస్తే కబ్జా పేరుతో దందా సాగించారు. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో చంద్రబాబు అండ్ కో విశాఖలో భూ దందాలకు తెగబడినప్పుడు కీలక సూత్రధారి గంటాయేనని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. గంటా శ్రీనివాసరావే భూదొంగ అంటూ అదే పార్టీకి చెందిన సీనియర్ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడే స్వయంగా సిట్‌కు ఫిర్యాదు చేయడంతో కలకలం రేగింది. అక్రమాల ఆరోపణలు చుట్టుముట్టడంతో తరుణంలో భీమిలి నుంచి ఎలాగైనా తప్పించుకోవాలని గంటా నిర్ణయించుకున్నారు.

ఓటేసిన జనాన్ని లెక్క చేయని గంటా..

తాను చేసిన అక్రమాలు, అవినీతి పనులు బట్టబయలు కావడంతో 2019 ఎన్నికల్లో భీమిలి ప్రజలు ఛీకొడతారని ముందుగానే ఊహించిన గంటా.. వ్యూహాత్మకంగా బీజేపీకి కేటాయించిన విశాఖ ఉత్తర సీటును దక్కించుకున్నారు. ఎలాగోలా భీమిలి నుంచి బయటపడి టికెట్ తెచ్చుకున్న గంటా.. ఎన్నికల సమయంలో ఉత్తర నియోజకవర్గ ప్రజల్ని మోసపూరిత హామీలతో మభ్యపెట్టారు. పోలింగ్ సమయంలో చివరి నిమిషంలో బర్మాక్యాంపు తదితర కొండవాలు ప్రాంతాల్లో దొంగ ఓట్ల వ్యవహారంతో గట్టెక్కి విజయం సాధించారు. అంతే ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత నేటి వరకూ ఉత్తర ప్రజలకు ఒక్కసారైన మొహం చూపించకుండా ఎంవీపీలోనే తిష్టవేసుక్కూర్చున్నారు. తాము ఓటేసి గెలిపించిన పాపానికి తగిన శాస్తి జరిగిందంటూ ఆవేదన చెందుతున్న నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కేకే రాజు అండగా నిలబడ్డారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారు. ఈసారి ఉత్తరంలో పోటీ చేస్తే.. ఓటమి తప్పదని భావించిన గంటా.. మరోసారి భీమిలికి వెళ్లిపోవాలని అక్కడి నేతలతో మంతనాలు ప్రారంభించారు. గెలుపొందిన చోట్ల దోపిడీకి పాల్పడే గంటా చేతిలో మరోసారి తాము మోసపోయే స్థితిలో లేమని భీమిలి ప్రజలంతా ముక్త కంఠంతో చెబుతున్నారు. అయినా నిస్సిగ్గుగా భీమిలిని దోచుకునేందుకు గంటా మళ్లీ బయలుదేరడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బొగ్గు లారీ బీభత్సం

- 8 మందికి తీవ్ర గాయాలు.. ముగ్గురి పరిస్థితి విషమం
- దెబ్బతిన్న కార్లు, ఆటోలు, బైక్‌లు, లారీలు
- ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రయాణికుల అవస్థలు
- లంకెలపాలెం కూడలిలో ఘటన



లంకెలపాలెం కూడలిలో బీభత్సం సృష్టించిన బొగ్గు లారీ ఇదే..



లారీ ఢీకొనడంతో కారుపై ఎగిరి పడిన ట్రాక్టర్

పరవాడ: లంకెలపాలెం కూడలిలో ఓ బొగ్గు లారీ సృష్టించిన బీభత్సానికి ప్రజలు, ప్రయాణికులు భయభ్రాంతులకు గురై పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో 8 మందికి తీవ్రగాయాలు కాగా.. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. లారీ ఢీ కొట్టిన ఈ ఘటనలో ఓ ట్రాక్టర్ అక్కడే ఉన్న కారుపై ఎగిరిపడింది. మొత్తంగా రెండు ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలు, రెండు కార్లు, మరో లారీ దెబ్బతిన్నాయి. విద్యుత్ స్తంభాలు, రెయిలింగ్‌లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. రెండు గంటలకు పైగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రయాణికులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బ్రేకులు ఫెయిలై ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. పరవాడ పోలీసులు తెలిపిన వివరాలివీ..

విశాఖ పోర్ట్ ట్రస్ట్ నుంచి బొగ్గు లోడుతో ఓ లారీ శుక్రవారం గాజువాక నుంచి అనకాపల్లి వైపు వేగంగా వస్తోంది. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో లంకెలపాలెం కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్ పడింది. దీంతో కార్లు, ఆటోలు, ట్రాక్టర్లు, లారీలు తదితర వాహనాలు ఆగాయి. అతివేగంగా వస్తున్న బొగ్గు లారీ సిగ్నల్ పాయింట్ వద్ద అదుపు తప్పి నిలిచి ఉన్న ఓ ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఆ ట్రాక్టర్ పైకి ఎగిరిపడి ఓ కారుపై పడింది. ఈ క్రమంలో మరో కారు, రెండు ఆటోలు, రెండు బైక్‌లు, లారీని బొగ్గు లారీ ఢీకొట్టుకుంటూ ముందుకు వెళ్లి ఆగింది. ఈ ప్రమాదంలో ఆ వాహనాలన్నీ దెబ్బతిన్నాయి. బొగ్గు లారీ ముందు భాగం, విద్యుత్ స్తంభాలు, రెయిలింగ్ ధ్వంసమయ్యాయి. దెబ్బతిన్న వాహనాల్లో ప్రయాణిస్తున్న 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. బొగ్గు లారీ డ్రైవర్ నీరజ్‌లాల్, చీడికాడ మండలం చుక్కపల్లికి చెందిన కె.వెంకటరమణ, అగనంపూడికి చెందిన డి.శ్రీనివాసరాజు పరిస్థితి విషమంగా ఉంది. చీడికాడ మండలం చుక్కపల్లికి చెందిన సంతోష్, అగనంపూడికి చెందిన చెందిన పల్లా శ్రీను, జి.హర్ష, జి.కొండయ్య, గాజువాకకు చెందిన బి.శరణ్య తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో కొందరి తలకు గాయాలవ్వగా.. మరికొందరి కాళ్లు, చేతులు విరిగిపోయాయి. క్షతగాత్రులను హుటాహుటిన 108 అంబులెన్స్‌లో అగనంపూడి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి కేజీహెచ్‌కు తరలించారు. అనకాపల్లి ఎస్పీ కార్యాలయంలో హెడ్ కానిస్టేబుల్‌గా డి.శ్రీనివాసరాజు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈయన ప్రస్తుతం పినాకిల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బొగ్గు లారీ బ్రేకులు ఫెయిల్ కావడం వల్లే ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు, ఆటో

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు శ్రమించిన పోలీసులు

నిత్యం రద్దీగా ఉండే లంకెలపాలెం కూడలిలో ఈ ప్రమాదం జరగడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. అక్కడే ఉన్న పరవాడ ఎస్ఐ సిరపరపు సురేష్ సిబ్బందిని అప్రమత్తం చేసి.. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి వైద్య సేవలందించారు. ధ్వంసమైన వాహనాలను క్రేన్ సాయంతో అక్కడి నుంచి తొలగించారు. లారీ కింద చిక్కుకున్న వాహనాలను తీయడానికి పోలీసులు శ్రమించారు. ప్రమాద కారణంగా జాతీయ రహదారిపై 2.30 గంటల పాటు ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో ప్రయాణికులు, వాహనచోదకులు నానా ఇబ్బందులు పడ్డారు. వాహనాలను ఫ్రీలెఫ్ట్ నుంచి సర్వీస్ రోడ్డు మీదుగా మళ్లించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మధ్యాహ్నం 3 గంటలకు ట్రాఫిక్ సమస్య తీరడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.



ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితులు



విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ఆటగాళ్లు పృథ్వీషా, ఇషాంత్ శర్మ, కుల్దీప్ యాదవ్, హోప్, విక్కీ, అక్షర్ పటేల్

గెలుపెవరిది?

- రేపు డీసీతో సీఎస్‌కే మ్యాచ్
- విశాఖ చేరిన ఆటగాళ్లు



ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాడు ముఖేష్‌కుమార్, డైరెక్టర్ గంగూలీ, హెడ్ కోచ్ రికీ పాంటింగ్

విశాఖ స్పోర్ట్స్/గోపాలపట్నం: ఐపీఎల్‌లో భాగంగా తలపడేందుకు ఢిల్లీ క్యాపిటల్స్(డీసీ), చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) జట్లు శుక్రవారం సాయంత్రం విశాఖ చేరుకున్నాయి. ఇరు జట్లకు విమానాశ్రయంలో అభిమానులు ఘన స్వాగతం పలికారు. రెండు జట్ల సభ్యులు ప్రత్యేక బస్సుల్లో రోడ్డు మార్గంలో రాడిసన్ బ్లూ హోటల్ వెళ్లారు. పీఎంపాలెంలోని వైఎస్సార్ స్టేడియంలో ఆదివారం ఇరు జట్లు తలపడనుండగా.. శనివారం ప్రాక్టీస్ చేయనున్నాయి. ఈ మ్యాచ్ టికెట్లు హాట్‌కేక్‌లా నిమిషాల వ్యవధిలోనే అమ్ముడుపోయిన సంగతి తెలిసిందే. ప్రస్తుత 17వ ఐపీఎల్ సీజన్‌లో ఇప్పటివరకు జరిగిన మ్యాచ్‌ల్లో ఆర్‌సీబీ మినహా హోం గ్రౌండ్ జట్లే విజయకేతనం ఎగురవేస్తున్నాయి. డీసీ ఇప్పటివరకు ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓటమి పాలైంది. డీసీ విశాఖను తొలి సెషన్ మ్యాచ్‌లకు హోం గ్రౌండ్‌గా ఎంచుకుంది. ఇక డిఫెండింగ్ చాంపియన్ హోదాలో ఇప్పటికే సీఎస్‌కే ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించింది. అయితే ఈ రెండు మ్యాచ్‌లను హోం గ్రౌండ్‌లోనే ఆడి గెలిచింది. ఆదివారం జరిగే మ్యాచ్‌లో ఇదే ఊపును సీఎస్‌కే కొనసాగిస్తుందా లేక హోం గ్రౌండ్ సెంటిమెంట్‌తో డీసీ గెలుపునకు శ్రీకారం చుడుతుందా? అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.

మ్యాచ్‌కు అంతా సిద్ధం

విశాఖ స్పోర్ట్స్: ఈ నెల 31న డీసీతో తలపడే సీఎస్‌కే మ్యాచ్‌కు వైఎస్సార్ స్టేడియం సిద్ధమైందని ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథ్‌రెడ్డి తెలిపారు. ప్రేక్షకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జిల్లా పోలీస్ అధికారుల సహకారంతో బీసీసీఐ నిబంధనల మేరకు సర్వం సిద్ధం చేశామన్నారు. ఏసీఏ అధ్యక్షుడు శరత్‌చంద్రారెడ్డి నాయకత్వంలో నాలుగేళ్లలో మ్యాచ్‌లను విజయవంతంగా నిర్వహించడంతోనే ఐపీఎల్ మ్యాచ్‌లు కేటాయించారన్నారు. ఏసీఏ ఆధ్వర్యంలో క్రీడాకారులు, మ్యాచ్ నిర్వహణ సిబ్బందికి అన్ని రకాల వసతులు కల్పిస్తున్నట్లు గోపీనాథ్‌రెడ్డి వెల్లడించారు.



విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న చెన్నై సూపర్ కింగ్స్ ఆటగాళ్లు రుతురాజ్, రవీంద్ర జడేజా, రచిన్ రవీంద్ర, బ్రావో, శార్దూల్ ఠాకూర్

అణువణువు..

ఆధ్యాత్మికతకు నెలవు

ఓ వైపు సువిశాల సాగరతీరం.. మరోవైపు మది దోచే పచ్చని గిరులు.. అణువణువునా అద్భుత సోయగం.. మనసును సేద తీర్చే ఆహ్లాదకర వాతావరణం.. కలబోసిన ఆధ్యాత్మిక నిలయం రుషికొండలోని శ్రీవారి ఆలయం. సాక్షాత్తు తిరుమల వైకుంఠనాథుడే కొలువయ్యారా అన్నట్లుగా దర్శనమిచ్చే స్వామి రూపం మది నిండా మధురానుభూతిని పంచడంతో భక్తకోటి స్వామి దర్శనానికి తరలివస్తున్నారు. రుషికొండ తీరంలోని ఉత్తరాంధ్ర వైకుంఠధామంగా అలరారుతున్న శ్రీ మహాలక్ష్మి, గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం ద్వితీయ వార్షికోత్సవానికి ముస్తాబైంది.



శ్రీవారి ఆలయ ముఖద్వారం



శ్రవణ నక్షత్రంలో నిర్వహించే తిరు మంజనం

సాగరతీరాన కొలువుదీరిన సప్తగిరుల వెంకన్న

- ఉత్తరాంధ్ర వైకుంఠధామంగా అలరారుతున్న రుషికొండ ఆలయం
- తిరుమల శ్రీవారిని తలపిస్తున్న స్వామి రూపం
- నేడు ఆలయ ద్వితీయ వార్షికోత్సవం



శ్రీవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

కొమ్మాది: శ్రీ వారి ఆలయం అణువణువు ఓ అద్భుతమే. సాగర తీరానికి అభిముఖంగా ఉత్తరాంధ్ర వైకుంఠధామంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో పది ఎకరాల్లో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని టీటీడీ నిర్మించింది. 1.5 ఎకరాల్లో ప్రధాన ఆలయ నిర్మాణం జరిగింది. కొండపైకి రోడ్డు మార్గాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఆర్చి నుంచి లోపలికి అడుగిడగానే ఘాట్‌రోడ్డుకు ఇరువైపులా పూల మొక్కలు, శ్రీవారి నామాలు, పూలకుండీలు స్వాగతిస్తాయి. ఇక ప్రధాన ఆలయం ఆధ్యాత్మిక శోభతో, శిల్పకళానైపుణ్యంతో చూపు మరల్చనీయదు. తిరుమలలో శిల్ప కళాకారులు రూపొందించిన శ్రీ వేంకటేశ్వర స్వామి విగ్రహంతో పాటు ఆంజనేయ స్వామి, శ్రీవారి పాదాలు, భూదేవి విగ్రహాలు భక్తి భావనను ఇనుమడింపజేస్తాయి.

ప్రత్యేక పూజలు

శ్రీవారి ఆలయంలో సాధారణ రోజుల్లో పూజలతో పాటు ప్రత్యేక దినాల్లో విశేష కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ప్రతీ నెల శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని స్నపన తిరుమంజనం, ప్రతీ శుక్రవారం వారాభిషేకంలో భాగంగా శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ, భోగి నాడు గోదాదేవి కల్యాణం జరిపిస్తున్నారు. ఏటా మూడు పర్యాయాలు వైకుంఠ ఏకాదశి, ఉగాది, బ్రహ్మోత్సవాల ముందు మంగళవారం నాడు కోయల్ ఆల్వార్ తిరుమంజనం వైభవంగా నిర్వహిస్తారు. అదే విధంగా ప్రతీ శనివారం పలు స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసే కోలాటాలు, శ్రీవారి నామ సంకీర్తన తదితర కార్యక్రమాలు భక్తులను మంత్ర ముగ్ధులను చేస్తుంటాయి. రాష్ట్రం నలుమూలల నుంచి పలువురు మహిళలు పెద్ద ఎత్తున శ్రీవారి సేవ చేసేందుకు వస్తుంటారు.

శ్రీవారి ఆలయాన్ని చేరుకునే మార్గం

శ్రీవారి ఆలయానికి జిల్లా నుంచే కాకుండా దేశం నలుమూలల నుంచి భక్తులు తరలి వస్తున్నారు. ఆలయానికి చేరుకునేందుకు కొండపైకి ద్విచక్రవాహనాలు, కార్లు, బస్సులు మాత్రమే అనుమతిస్తున్నారు. ఆటోలకు అనుమతి లేదు. కొండ చిన్నది కావడంతో భక్తులు నడిచి ఆలయాన్ని చేరుకోవచ్చు. కొండ దిగువ నుంచి కొండపై శ్రీవారిని చేరుకునేందుకు ఉచిత బస్సు సౌకర్యం కూడా ఉంది. రాత్రి 7.30 గంటల వరకు మాత్రమే భక్తులకు దర్శనాలకు అనుమతిస్తున్నారు.

వార్షికోత్సవానికి సన్నాహాలు

ఈ నెల 30వ తేదీన శ్రీవారి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వేడుకల్లో భాగంగా 26వ తేదీన కోయల్ ఆల్వార్ తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. శనివారం ఆలయ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. శ్రీవారి ఆలయానికి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా క్యూలు ఏర్పాటు చేస్తున్నట్లు ఏఈవో జగన్ మోహనాచార్యులు వెల్లడించారు.

తనిఖీల్లో రూ.11 లక్షల నగదు పట్టివేత



శ్రీహరిపురంలో నగదు స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

మల్కాపురం/పద్మనాభం/మర్రిపాలెం: జిల్లాలో ఎన్నికల అధికారులు శుక్రవారం నిర్వహించిన తనిఖీల్లో రూ.11 లక్షల నగదు పట్టుబడింది. జీవీఎంసీ 60వ వార్డు పరిధి శ్రీహరిపురం జవహర్‌నగర్ రోడ్డు ప్రాంతంలో మల్కాపురం పోలీసులు తనిఖీలు చేశారు. ఆ సమయంలో ఓ కారులో రూ.5 లక్షలు గుర్తించారు. ఆ నగదును ఎందుకు తీసుకెళ్తున్నావు అని కారులో ఉన్న వ్యక్తిని పోలీసులు ప్రశ్నించారు. దీనిపై ఆయన పొంతన లేని సమాధానాలు చెప్పడంతో స్వాధీనం చేసుకున్నారు. దీనిపై సీఐ సన్యాసినాయుడు విచారణ చేపడుతున్నారు.

- పద్మనాభం మండలం చిన్నాపురం జంక్షన్‌లో రూ.3 లక్షలు పట్టుకుని సీజ్ చేసినట్టు స్టాటిక్ సర్వైలెన్స్ బృంద సభ్యుడు ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం 4 గంటల సమయంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా విలాస్కానిపాలెం నుంచి విజయనగరం వైపు కోకాకోలా వ్యాన్ వెళ్తోంది. ఈ వ్యాన్ తనిఖీ చేసి.. సేల్స్‌మన్ దాసరి చంద్రశేఖర్ నుంచి రూ.3లక్షలు స్వాధీనం చేసుకున్నారు. అతను రూ.1,80,000కు మాత్రమే ఆధారాలు చూపించారని ప్రభాకర్ తెలిపారు. దీంతో మొత్తం రూ.3 లక్షలు సీజ్ చేసి తహసీల్దార్ ఎస్.వెంకటరావుకు అప్పగించినట్టు వివరించారు.
- జ్ఞానాపురం వద్ద చేపట్టిన తనిఖీల్లో ఇద్దరు వ్యక్తుల నుంచి ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పోలీసులు రూ.3 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఐదో పట్టణ సీఐ ఎస్ భాస్కరరావు నేతృత్వంలో ఎస్ఐ దివ్యభారతి శుక్రవారం జ్ఞానాపురం వద్ద తనిఖీలు నిర్వహించారు. దేవరాపల్లికి చెందిన సత్యనారాయణ బైక్‌పై జ్ఞానాపురం మీదుగా తన స్వగ్రామం వెళ్తున్న క్రమంలో తనిఖీలు చేయగా.. అతడి వద్ద రూ.లక్ష, పెందుర్తికి చెందిన షణ్ముఖ కారులో జగదాంబ నుంచి తన ప్రాంతానికి వెళ్తున్న క్రమంలో అతడి వద్ద రూ.2 లక్షలు గుర్తించారు. వారి వద్ద ఎటువంటి పత్రాలు,ఆధారాలు లేకపోవడంతో నగదు స్వాధీనం చేసుకుని.. ఎన్నికల అధికారులకు అప్పగించారు.

'గంటా పెద్ద అవినీతిపరుడు'

తగరపువలస : గతంలో గంటా శ్రీనివాసరావు మంత్రిగా ఉన్నప్పుడు టీచర్ ఉద్యోగాల పేరుతో తమ గ్రామంలో ఒక్కొక్కరి నుంచి రూ.6 లక్షలు కాజేశారని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కొల్లి కోటిరెడ్డి ఆరోపించారు. మూలకుద్దు పంచాయతీలో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటిరెడ్డి మాట్లాడుతూ హుద్‌హుద్ తుఫాన్‌కు తమ గ్రామం మునిగిపోతే కనీసం పట్టించుకోలేదన్నారు. ఆయన పాలన అంతా అవినీతిమయమన్నారు. తహసీల్దార్ పోస్టుకు రూ.25 లక్షలు, సీఐ పోస్టుకు రూ.10 లక్షలు, ఎంపీడీవోకు రూ.10 లక్షలు, సబ్ రిజిస్ట్రార్‌కు రూ.70 లక్షలు చొప్పున తీసుకుని పోస్టింగ్ ఇవ్వడం వల్ల ఆయా కార్యాలయాలలో డబ్బులు ఇస్తే తప్ప పనులు జరిగేవి కావన్నారు. ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవతో చిట్టివలస జ్యూట్‌మిల్లు కార్మికులకు రూ.35 కోట్ల నష్టపరిహారం అందిందని.. రూ.70 లక్షలతో శ్రీరామ్‌నగర్ మీదుగా బీటీ రోడ్డు పనులు పూర్తయ్యాయన్నారు.